ట్రాఫిక్ సమస్యకు మోక్షమెన్నడో?

కొడవలూరు రైల్వే గేట్ వద్ద ఫ్లై ఓవర్ వంతెన నిర్మిస్తే తప్ప ట్రాఫిక్ సమస్యకు మోక్షం కలిగేలా లేదు. ప్రత్యామ్నాయంగా టపాతోపు వద్ద అండర్ పాస్ నిర్మాణం జరిగినప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదు. 2015లోనే ఈ గేట్ వద్ద రూ.50 కోట్లతో ఫ్లై ఓవర్ వంతెనను ప్రతిపాదించారు. రైల్వే శాఖ ఇవ్వాల్సిన 50 శాతం వాటా జాప్యం జరగడంతో నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావాలంటే ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం విధిగా చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం అంచనా వ్యయం కూడా రెండింతలు పెరిగింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యకు విముక్తి కలుగుతుందా.. లేదా? అనేది ప్రయాణికులను వెంటాడుతోంది.

- కొడవలూరు రైల్వే గేటు వద్ద నిత్యం నరకయాతన
- 2015లోనే రూ.50 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి అంచనా
- రైల్వే శాఖ వాటా రూ.25 కోట్ల మంజూరులో జాప్యం


కొడవలూరు రైల్వే గేటు వద్ద వేచి ఉన్న వాహనాలు

కొడవలూరు : రాకపోకలకు సంబంధించి కొడవలూరు రైల్వే గేటు ఎంతో కీలకమైంది. నార్తురాజుపాళెం నుంచి మండల కేంద్రమైన కొడవలూరుతో పాటు మండలంలోని అనేక గ్రామాలకు, అల్లూరు, విడవలూరు మండలాలకు వెళ్లాలంటే ఈ గేటు ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంది. నెల్లూరు, కావలి వైపుల నుంచి వచ్చే వాహనాలు నార్తురాజుపాళెం వచ్చి అక్కడి నుంచి కొడవలూరు రైల్వే గేటు ద్వారా వెళ్తుంటాయి. దీంతో ఈ గేటు నిత్యం రద్దీగా ఉంటుంది. రైల్వే మూడో లైను ఏర్పాటుతో రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగి గేటు వద్ద మూడు లేదా నాలుగు రైళ్లు వెళ్లే వరకు గేటు వేస్తున్నారు. దీంతో గేటు వద్ద వాహనాలు బారులు తీరి నిలిచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు వేచి ఉండలేక వాహనదారులు అల్లాడిపోతున్నారు.

పెద్దగా ఫలితమివ్వని అండర్ పాస్

కొడవలూరు రైల్వే గేటు వద్ద నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని అక్కడికి ఒకటిన్నర కిలో మీటరు దూరంలోని టపాతోపు గేట్ వద్ద రైల్వే శాఖ రూ.11 కోట్లతో అండర్ పాస్ నిర్మించింది. ఈ అండర్ పాస్ నాలుగు నెలల క్రితం అందుబాటులోకి వచ్చింది. అయితే దీని ద్వారా చిన్న వాహనాలు మాత్రమే వెళ్లేందుకు అనుమతి ఉంది. లారీలు, బస్సుల్లాంటి పెద్ద వాహనాలు దీని ద్వారా వెళ్లేందుకు అనుమతి లేదు. ఒకవేళ అనధికారికంగా వెళ్లేందుకు యత్నించినా మలుపు తిరగలేక ఇరు వైపులా గోడలకు ఢీకొంటున్నాయి. ఎక్కువగా ధాన్యం లారీలు వెళ్లాల్సి ఉండడంతో ఎత్తు బాగా ఎక్కువై వెళ్లడం కష్టంగా మారింది. ఆర్టీసీ బస్సులైతే ఎక్కువ ప్రయాణికులుండే కూడలి ప్రాంతమైన నార్తురాజుపాళేనికి విధిగా వెళ్లాల్సి ఉంది. ఈ కారణంగా పెద్ద వాహనాలన్నీ కొడవలూరు గేటు ద్వారానే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా కావలి వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు విధిగా కొడవలూరు గేటు ద్వారానే వెళ్తున్నాయి. ఒకవేళ వారు టపాతోపు అండర్ పాస్ ద్వారా వెళ్లాలంటే అదనంగా 3 కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. దీంతో వారు కొడవలూరు గేటు ద్వారానే వెళుతున్నారు. దీనివల్ల ఈ గేటు వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది.

రెండింతలు పెరిగిన అంచనా వ్యయం

ఈ గేటుకున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని 2015లోనే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అందుకు రూ.50 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే రైల్వే శాఖ నిబంధనల ప్రకారం రైల్లే గేటుపై ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలంటే 50 శాతం రైల్వే శాఖ భరిస్తుంది. మిగిలిన యాభై శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. అంటే పట్టాలపై జరిగే వంతెన నిర్మాణానికి అయ్యే ఖర్చును రైల్వే శాఖ భరిస్తుందన్న మాట. ఈ నిబంధనలకు లోబడి అప్పట్లోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. రైల్వే శాఖ తన వాటా రూ.25 కోట్లు ఇవ్వాలంటే నిబంధనలున్నాయంటూ ఈ ప్రాంతంలో మట్టి పరీక్షలు చేపట్టారు. ఇక్కడ పారుదల కాలువలున్నందున మట్టిలో పటుత్వం ఉండదన్న సాకు చూపి నిధుల మంజూరులో జాప్యం చేస్తూ వచ్చారు. విధిలేని పరిస్థితుల్లో నిర్మించాల్సి వచ్చినా అంచనా వ్యయం పెరుగుతుందంటూ దాట వేస్తూ వచ్చారు. ఫలితంగా ఫ్లై ఓవర్ కార్యరూపం దాల్చక ట్రాఫిక్ సమస్య అలాగే ఉండిపోయింది. ఇప్పుడు నిర్మాణం చేపట్టాలన్నా అంచనా వ్యయం భారీగా పెరిగిందని, రూ.100 కోట్లకు పైగా వెచ్చించాల్సి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సమస్య తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని ప్రత్యేక చొరవ చూపి ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగేలా చూడడం ద్వారా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇబ్బంది తప్పడం లేదు



మండల కేంద్రానికి రావాలంటే నార్తురాజుపాళెం వచ్చి కొడవలూరు రైల్వే గేటు ద్వారానే వెళ్లాల్సి ఉంది. ఇక్కడ గేటు వేస్తే మూడు లేదా నాలుగు రైళ్లు వెళ్లే వరకు తీయడం లేదు. ఒకవేళ టపాతోపు అండర్ పాస్ నుంచి వెళ్దామంటే మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంది. దీంతో కొడవలూరు గేటు వద్ద వేచి ఉండి ఇబ్బంది పడుతున్నాం.

– దేవనబోయిన శివకుమార్, రేగడిచెలిక

నిత్యం పడిగాపులే



ప్రతి అవసరానికి నార్తురాజుపాళెం రావల్సి ఉండడంతో ప్రతిరోజూ ఒకట్రెండు పర్యాయాలు నార్తురాజుపాళెం వెళ్లాలి. కొడవలూరు రైల్వే గేటు మీదుగానే వెళ్లాల్సి ఉండడంతో పడిగాపులు తప్పడం లేదు. టపాతోపు అండర్ పాస్ ద్వారా వెళ్లాలంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉండడంతో తప్పని పరిస్థితుల్లో గేటు వద్దే వేచి ఉండిపోతున్నాం. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మిస్తామని ఎప్పట్నుంచో చెబుతున్నారు. కానీ కార్యరూపం దాల్చడం లేదు. ఫలితంగా మాకు అవస్థలు తప్పడం లేదు.

– చిమటా శేషగిరి, దామేగుంట

క్లుప్తంగా

పండ్లు, బ్రెడ్ల పంపిణీ



నెల్లూరు(అర్బన్) : నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలో ఉన్న ప్రసూతి వార్డులో పండ్లు, బ్రెడ్ల పంపిణీ ఆదివారం జరిగింది. విశ్వమాతా సేవా ఫౌండేషన్ చైర్మన్ దూబిశెట్టి కల్యాణి ఆధ్వర్యంలో ఆమె తమ్ముడు దూబిశెట్టి మల్లికార్జున పుట్టినరోజును పురస్కరించుకుని వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ చైర్మన్ కల్యాణి మాట్లాడుతూ రామచంద్రారెడ్డి ఆస్పత్రితో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. పేదలకు ఇలాంటి చిన్న, చిన్న సాయం చేయాలనుకునే వారు తమ ఫౌండేషన్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ రాజు, ఫౌండేషన్ సభ్యులు చంద్రకళ, భరత్, మల్లికార్జున, రాములు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవికి కోటేశ్వరరెడ్డి రాజీనామా

నెల్లూరు సిటీ : వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత పేర్నేటి కోటేశ్వరరెడ్డి ఆదివారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఆ శాఖ అధికారులకు అందజేశారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు (స్టౌన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లోని క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు గౌడ్, ప్రభాకర్ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్ బాబు, కోశాధికారి ఓ.జయదేవ్, అసోసియేషన్ వ్యవస్థాపకులు మేకల నరేంద్ర రెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్ర, లోకేశ్, ఓబుల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హుస్సేన్, నారాయణరావు, రాజా రమేష్, కొండారెడ్డి, పొన్నం రవిచంద్ర, జనార్దన్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ కో–ఆర్డినేటర్ బాలరామయ్య నాయుడు, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్న సభ్యులు

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని బుజబుజ నెల్లూరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం జరిగింది. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యుల వారి ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో కమిటీ సభ్యుడు డి.సురమౌళి మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి ప్రచారం చేశారన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల గురించి తెలుసుకోవడం వల్ల ధర్మముల స్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందర రాజా, కోటేశ్వరరావు, సుమలత, ప్రదీప్, సుజిత్, విజయమ్మ, సునీల్, పద్మజ, ప్రదీప్, నిగమశ్రీ, శేఖర్, ధనలక్ష్మి, మోహన్, అన్నపూర్ణ, కేవీ రత్నం, జ్ఞానేశ్వర్, రఘురామయ్య, వెంకటేశ్వర్లు, డీవీ ప్రసాద్, అవినాష్, కృష్ణ, నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు డివిజన్‌లో వర్షపాతం

ఉదయగిరి: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం తదితర మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. ఉదయగిరి మండలంలో 8.4 మి.మీ., సీతారామపురం మండలంలో 31.2 మి.మీ., సంగం మండలంలో 41.4 మి.మీ., అనంతసాగరం మండలంలో 14.6 మి.మీ., ఆత్మకూరు మండలంలో 16.2 మి.మీ., చేజర్ల మండలంలో 28.4 మి.మీ., ఏఎస్‌పేట మండలంలో 10.6 మి.మీ., కలువాయి మండలంలో 8.4 మి.మీ., మర్రిపాడు మండలంలో 11.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. అకాల వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది. ఈ వర్షం రైతులకు ప్రయోజనకరమని పలువురు పేర్కొన్నారు.

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలి


ప్రమాదకరంగా రోడ్డు మలుపు

పొదలకూరు : రోడ్డు మలుపు వద్ద వెంటనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలోని సంగం–పొదలకూరు మార్గం తాటిపర్తి గ్రామానికి సమీపంలో వృద్ధుల ఆశ్రమం వద్ద ఉన్న రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపును దాటే సమయంలో తరచుగా వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఫలితంగా తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలుకావడం, లేదంటే ప్రాణాలు కూడా కోల్పోవడం జరుగుతోంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ తీసుకుని మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చునని వాహనచోదకులు తెలియజేస్తున్నారు.

కనకదుర్గమ్మకు పొంగళ్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో ఉన్న శ్రీకనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని పాలపొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పుల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కేసీ నారాయణ, ఎంఎస్ రెడ్డి, పి.వెంగయ్య, డాక్టర్ కృష్ణారెడ్డి, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమ్మరైతులకు ఉపశమనం

- వర్షంతో బెట్ట నుంచి బయటపడిన తోటలు


సాగులో ఉన్న నిమ్మతోటలు

పొదలకూరు : సకాలంలో వర్షాలు కురవక బెట్టకు వచ్చిన నిమ్మతోటలకు ఉపశమనం కలిగింది. పొదలకూరు చుట్టుపక్కల రెండురోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల తాత్కాలికంగా నిమ్మ తోటలు బెట్ట నుంచి బయటపడడంతో రైతులు ఉపశమనం పొందారు. వర్షపాతం కొన్ని గ్రామాల్లో ఒక మోస్తరుగా, మరికొన్ని గ్రామాల్లో భారీగా కురుస్తోంది. ఫలితంగా నిమ్మతోటలకు ఉపయోగపడే విధంగా వర్షం కురిసినట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం మరో రెండు రోజుల పాటు రుతుపవనాల ప్రభావం వల్ల వర్షం కురిసే అవకాశం ఉంది. అయితే మండలంలో అధిక సంఖ్యలో రైతులు నిమ్మతోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. తోటలు ఎక్కడా ఎండదశకు చేరుకోకున్నా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో బెట్టకు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో నీటి లభ్యత లేకుంటే పూత పూయడం తగ్గుతుందని రైతులు భావించారు. అయితే ప్రస్తుతం ఆశాజనకంగా వర్షం కురుసింది. దీంతో నిమ్మరైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

బీజేపీ నేతల సంబరాలు


పొదలకూరు : సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

పొదలకూరు : దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడో పర్యాయం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఆదివారం మండల బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు పట్టణంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.అయోధ్యరామయ్య, నాయకులు సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, ఆర్.ధనుంజయరావు, వి.రామకృష్ణగౌడ్, శ్రీనివాసులు, రవికుమార్, ప్రసాద్, విష్ణు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజపురం గ్రామంలో..

మనుబోలు : మండలంలోని గోవిందరాజపురం గ్రామంలో జనసేన, బీజేపీ నాయకులు ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్, చంద్రబాబుల చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ పవన్, చంద్రబాబుల ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నేతలు చెలికం కోటేశ్వరరెడ్డి, అజయ్‌రెడ్డి, ముప్పవరపు చిన్న, సుబ్రహ్మణ్యం, కంటే సుధాకర్, శ్రీహరి, మహేష్, హరి, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ భారీ ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : భారత ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు కార్యకర్తలు నినాదాలు చేస్తూ ర్యాలీని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలో ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన మండల, జిల్లాస్థాయి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని వనంతోపు సెంటర్ కొండాయపాళెంలో ఉన్న జనహిత వాత్సల్య ఆశ్రమంలో మంచి మార్కులు సాధించిన 18 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.వెయ్యి వంతున ప్రోత్సాహక బహుమతులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ 10 మంది విద్యార్థులకు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ అధికారి బాలకృష్ణారెడ్డి, ఇద్దరు విద్యార్థులకు సబ్ ట్రెజరీ అధికారి రమణరావు, ఒక విద్యార్థికి ఏఓ కమల్ కిరణ్, ఇద్దరు విద్యార్థులకు పబ్లిక్ హెల్త్ నర్స్ సక్కుబాయమ్మ, ముగ్గురు విద్యార్థులకు హెల్త్ సూపర్‌వైజర్ వసంత దాతలుగా వ్యవహరించి వారి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారన్నారు. పిల్లలందరికీ స్నాక్స్‌ను కల్పం శ్రీనివాసులు అందజేశారన్నారు. తల్లిదండ్రుల్లేని బిడ్డలను ప్రోత్సహిస్తూ వారి విద్యాభివృద్ధిలో సహాయం చేస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు. గూడూరు సబ్ ట్రెజరీ అధికారి ఎస్కే మక్బూద్ రూ.5000లతో నిత్యావసర సరుకులు అందజేశారన్నారు. కార్యక్రమంలో సేవా టీమ్ నిర్వాహకులు పరిమళ, రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు ఖాదర్ మస్తాన్, ఆశ్రమ చార్టెర్డ్ అకౌంటెంట్ దుర్గాప్రసాద్, సాఫ్టవేర్ ఇంజనీర్ వెంకట సాయి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు

గ్రామీణ విద్యార్థులకు ఇంటర్ తరగతులు


ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్


బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్

ముత్తుకూరు : పదో తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు గత ప్రభుత్వం ఇంటర్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల భారం తప్పించేందుకు మండలంలోని రెండు హైస్కూళ్లలో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టింది. 2022–23 సంవత్సరంలో మొదట బ్రహ్మదేవి హైస్కూల్‌లో ఇంటర్ విద్యను ప్రారంభించారు. కేవలం బాలికలకు మాత్రమే అవకాశం కల్పించారు. హైస్కూల్ ప్లస్‌గా మారిన ఈ పాఠశాలలో ప్రస్తుతం జూనియర్ ఇంటర్‌లో నలుగురు, సీనియర్ ఇంటర్‌లో ఆరుగురు విద్యార్థినులు ఉన్నారు. జూనియర్ కాలేజీకి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థినులు సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు హెచ్‌ఎం తాన్య అన్నారు.

అలాగే, ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌లో ఈ సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆంగ్ల మాధ్యమంలో కో–ఎడ్యుకేషన్ కింద తరగతులు, అడ్మిషన్లు ప్రారంభించారు. మొదటి సారిగా ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు మాత్రమే బోధన సాగుతుందని హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రస్తుతం జూనియర్ ఇంటర్‌లో ముగ్గురు విద్యార్థులు చేరారని చెప్పారు. ఇంటర్ విద్య ప్రారంభించిన అంశాన్ని ఉపాధ్యాయుల ద్వారా ప్రచారం చేస్తున్నామని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : మండలంలోని ప్రభగిరిపట్నం, తాటిపర్తి, విరువూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

స్వర్ణాంజనేయునికి పుష్పాలంకరణ



ముత్తుకూరు : ముత్తుకూరులోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వర్ణాంజనేయస్వామి పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాల తోరణాలతో శోభాయమానంగా అలంకరించిన ఆలయంలో స్వామిని దర్శించేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. సోమా హనుమంతరావు, సోమా శ్రీనివాసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

దేవాంగులు సంఘటితంగా ఉండాలి


దేవాంగుల ఐక్యతను చాటుతున్న సంఘ నేతలు

మనుబోలు : సమస్యల పరిష్కారం కోసం దేవాంగులంతా సంఘటితంగా ఉండి పోరాడాలని జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సజ్జ వెంకట సురేష్ పిలుపునిచ్చారు. జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ ఆలయంలో దేవాంగ సందర్శన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున దేవాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగులంతా ఐకమత్యంగా ఉంటూ తమ కుల వృత్తి అయిన చేనేత పరిశ్రమ అభివృద్ధికి పాటు పడాలన్నారు. తమ పిల్లలను చేనేత వృత్తికి పరిమితం చేయకుండా ఉన్నత చదువులు చదివించి మంచి ఉద్యోగాలు పొందేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న అంతిమయాత్ర పథకం, విద్యా వికాసం, ప్రతిభా పురస్కారాలు తదితర విషయాల గురించి సంఘం ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య వివరించారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు వెంకటసుబ్బయ్య, ఉదయభాస్కర్, వీరాస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓవెల్ విద్యార్థుల విజయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ వేణు తదితరులు

నెల్లూరు(అర్బన్) : ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు విజయభేరి మోగించి మంచి ర్యాంకులు సాధించారని ఓవెల్ విద్యాసంస్థల చైర్మన్ రంగిశెట్టి వేణు తెలిపారు. ప్రతిభ చూపి ర్యాంకులు సాధించిన విద్యార్థులను మాగుంట లేఅవుట్‌లోని ఓవెల్ జూనియర్ కళాశాలలో ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన కొండేటి అర్పితాసజిత్ జాతీయ స్థాయిలో 552 ర్యాంకు సాధించారన్నారు. అలాగే వెంకటనిఖిత్‌బాబు 808, రాకేష్ 1054, వెంకటసంతోష్‌కుమార్ యాదవ్ 1414, గీతేశ్వర్ 2242, అఖిల్ 2880, అనన్య 3875 ర్యాంకులు సాధించారన్నారు. ప్రతి తరగతిలో పరిమిత విద్యార్థులను మాత్రమే చేర్చుకుని ఒత్తిడి లేని నాణ్యమైన విద్యాబోధనతో పాటు, విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ కనపరచడం వల్ల మంచి ర్యాంకులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఓవెల్ విద్యాసంస్థల సీఈఓ ప్రమీల, జీఎం మహదేవ్, ఈడీ బాలు, ఏజీఎం గంగాధర్, ఉపాధ్యాయుల టీమ్ సుధీర్, రాము, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.